సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

సోమవారం | 24 | జూలై | 2023



విద్యాప్రమాణాలు పెంపొందించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంపొందించాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి అన్నారు.

- 8లో▸



ప్రకృతి వైద్య లైబ్రరీ..

ప్రకృతి వైద్య సాహిత్య విజ్ఞానాన్ని ప్రజాబాహుళ్యంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో కేయూ రిటైర్డ్ ఆచార్యులు రామేశ్వరం ప్రకృతి వైద్య గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$29^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి.

న్యూస్‌రీల్

కేంద్రానిదే బాధ్యత



హసన్‌పర్తి: మణిపూర్ మారణహోమాలకు కేంద్రానిదే బాధ్యత అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. ఓ వైపు మారణహోమం జరుగుతుంటే.. ప్రధాని మోదీ విదేశీ పర్యటనలకు వెళ్లి ఎంజాయ్ చేశారని విమర్శించారు. మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న పార్టీ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మణిపూర్ రాష్ట్రంలో మూడునెలలుగా రెండు తెగల మధ్య జరుగుతున్న భీకరమైన దాడుల్లో వందలాది మంది హత్యకు గురయ్యారని.. మహిళలపై వికృత చేష్టలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్గిల్ యుద్ధంలో దేశ రక్షణకోసం పోరాడిన ఓ సైనికుడి భార్యపైనా అల్లరిమూకలు లైంగిక దాడికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. అక్కడి సర్కారు శాంతిభద్రతలను కాపాడడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ఈమారణ హోమాన్ని నిరసిస్తూ ఈనెల 25వ తేదీన ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి, వాసుదేవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎం.చుక్కయ్య, టి.ఉప్పలయ్య, వీరన్న, రాములు, సంపత్, తిరుపతి, శ్రీనివాస్, పుల్లా అశోక్ పాల్గొన్నారు.

జాతీయ కార్యదర్శిగా సోదా



పరకాల: ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ సంఘ్ జాతీయ కార్యదర్శిగా పరకాల దళితబంధు కన్వీనర్ సోదా రామకృష్ణ ఎన్నికయ్యారు. రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ నగరంలో జరుగుతున్న ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ సంఘ్ జాతీయ కార్యవర్గ సమావేశంలో ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయనను తిరిగి జాతీయ కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు చరణ్ సింగ్ టాంక్ తెలిపారు. తెలంగాణలో దళితుల ఆర్థికాభివృద్ధి కోసం అమలవుతున్న దళితబంధుపై ప్రధానంగా చర్చ జరిగిందని, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

రేపు దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

సంగెం: వరంగల్ జిల్లా సంగెం మండల పరిధి గ్రామాల్లో దివ్యాంగులకు మంగళవారం బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ హనుమకొండ డీఎం సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంగెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉచిత బస్‌పాస్‌లు జారీ చేస్తామని పేర్కొన్నారు. వందశాతం మూగ, చెవిటి, 40 శాతానికిపైగా శారీరక వైకల్యం కలిగిన వారందరు సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు తీసుకొచ్చి బస్‌పాస్‌లు పొందాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రంగస్థల కళాకారులకు పురస్కారాలు

పర్వతగిరి : బతుకమ్మ జన్మస్థలమైన పర్వతగిరి మండలం చౌటపల్లికి చెందిన రంగస్థల కళాకారులు వడ్లకొండ సతీష్‌కుమార్, దామెర కల్యాణ్‌కుమార్, గుర్రం యాదగిరి, గౌరారపు యుగేందర్, గౌరారపు రాజకుమార్, మట్టపల్లి చిన్న మాధవరావు, మిట్టపల్లి సంపత్, చిందు యక్షగాన కళాకారుడు గడ్డం యాకయ్య స్వర్ణనంది పురస్కారాలకు ఎంపికైనట్లు శ్రీశాంతికృష్ణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శాంతికృష్ణ ఆచార్య తెలిపారు. ఈసందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా కళారంగంలో సేవలందిస్తున్న వీరికి ఆగస్టు 2న హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా పురస్కారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. చౌటపల్లి కళాకారులు పురస్కారాలకు ఎంపికవడంతో మంత్రి దయాకర్‌రావు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నిద్రావస్థలో నిఘా నేత్రం!



పనిచేయని సీసీ కెమెరాలు!

- ప్రధాన కూడళ్లలో నిఘా కరువు
- ఏదైనా ఘటన జరిగితే ఛేదన కష్టమే
- దర్యాప్తునకు షాపుల్లోని సీసీ టీవీ ఫుటేజీలే ఆధారం
- నిఘానేత్రాలకు మరమ్మతులు చేయాలని ప్రజల విజ్ఞప్తి



చింతల్ ఫ్లైఓవర్ సమీపంలో అలంకారప్రాయంగా మారిన సీసీ కెమెరాలు



ఖిలా వరంగల్ కోట మెట్టు దర్వాజా వద్ద పని చేయని సీసీ కెమెరాలు

ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ వద్ద మరమ్మతులకు నోచుకోని సీసీ కెమెరాలు

ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్నో నిఘా నేత్రాలున్నాయి. కానీ వాటిలో కొన్ని మాత్రమే పనిచేస్తున్నాయి. ఈస్టేషన్ పరిధిలో మొత్తం 2 లక్షల జనాభా ఉండగా.. నేరాల నియంత్రణకు రహదారులపై, ప్రధాన కూడళ్ల వద్ద పోలీసుల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానించారు. ఏ ప్రమాదం జరిగినా, నేరాలు జరిగినా.. సీసీ ఫుటేజీల సాయంతో గుర్తించి నియంత్రించేవారు. ప్రస్తుతం చాలా వరకు సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో కేసుల ఛేదన కష్టతరంగా మారినట్లు తెలుస్తోంది. కాగా.. దాతల సహకారం, పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ పరిధిలో వందల సంఖ్యలో కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ.. సగానికి సగం పనిచేయడం లేదని, పదుల సంఖ్యలో మాత్రమే నిఘా నేత్రాలు పనిచేస్తున్నట్లు తెలుస్తోంది.

అలంకార ప్రాయం..

వరంగల్ అండర్ బ్రిడ్జి నుంచి ఆర్టీఏ జంక్షన్, నర్సంపేట రోడ్డు లేబర్ కాలనీ, చింతల్ బ్రిడ్జి మీదుగా ఖిలా వరంగల్ జంక్షన్ వరకు, శాంతినగర్ రైల్వేగేట్ నుంచి కరీమాబాద్ మీదుగా రంగశాయిపేట వరకు, వరంగల్ ఆర్టీఏ జంక్షన్ నుంచి ఉర్సుగుట్ట జంక్షన్ వరకు రహదారులు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొన్ని పనిచేయడం లేదు. ఏదైనా ఘటన జరిగితే.. పోలీసులు స్థానికంగా ఉండే షాపుల నుంచి సీసీ ఫుటేజీలను సేకరిస్తున్నారు.

ఇటీవలి ఘటనలు

- వరంగల్ శంభునిపేట విశ్వనాథ కాలనీలో ప్రసాద్ అనే వ్యక్తి తన ఇంటి ఎదుట బైక్ పార్కు చేసి రాత్రి ఇంట్లో నిద్రించాడు. తెల్లవారు జామున చూస్తే బైక్ కనిపించలేదు. పోలీసులను ఆశ్రయించినా ఫలితం దక్కలేదు. రహదారుల వెంట సీసీ కెమెరాలు పనిచేయక బైక్‌ను ఇప్పటి వరకూ రికవరీ చేయలేదు. ఇప్పటికీ బాధితుడు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నాడు.
- వరంగల్ శివనగర్ పల్లవి ఆస్పత్రి లేన్‌లోని ఓ ఇంట్లో ప్రైవేట్ ఉద్యోగి నివాసం ఉంటున్నాడు. సాయంత్రం ఇంటి ఎదుట బైక్‌ను పార్క్ చేసి నిద్రించాడు. గుర్తు తెలియని దుండగులు బైక్‌ను ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా బైక్‌ను పట్టుకోలేకపోయారు.

మరమ్మతులు చేయిస్తున్నాం..



పనిచేయని సీసీ కెమెరాలను గుర్తించి మరమ్మతులు చేస్తున్నాం. స్టేషన్ పరిధిలో కెమెరాల ద్వారా నిఘాను పెంచుతున్నాం. నేరాల నియంత్రణకు దుకాణాలు, ఇళ్లు, కాలనీ రహదారులపై సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. అవసరమైన చోట్ల దాతలు, ప్రైవేట్ వ్యక్తులతో 345కు పైగా కెమెరాలు ఏర్పాటు చేయించాం. ఎక్కడ ఏ ఘటన జరిగినా క్షణాల్లో సమాచారం అందుతుంది. పని చేయని సీసీ కెమెరాలను గుర్తించి త్వరలోనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటాం.

– ముస్క శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్, మిల్స్‌కాలనీ, వరంగల్

ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంపునకు ‘ఎల్‌బీ’ విద్యార్థులు



క్యాంపునకు ఎంపికైన ఎన్‌సీసీ కేడెట్లతో ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్.రావు

రామన్నపేట: హైదరాబాద్ మెహదీపట్నంలో జరిగే ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంపునకు నగరంలోని ఎల్‌బీ కళాశాల ఎన్‌సీసీ పదో బెటాలియన్ నుంచి 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు తెలిపారు. క్యాంపు ద్వారా భారత ఆర్మీ కంటోన్మెంట్ ఏరియాలో ఇండియన్ ఆర్మీ ఉపయోగించే అన్ని రకాల ఆయుధాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆయుధాలతో ఫైరింగ్, వాటి ఉపయోగాలు, శత్రు శిబిరాల టార్గెట్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. పదిరోజుల పాటు జరిగే ఈక్యాంపు చాలా కఠోరమైనదని, ఎంతో దృఢ సంకల్పంతో శిక్షణలో పాల్గొనాల్సి ఉంటుందని వివరించారు. నైపుణ్యం ఉన్న కేడెట్లకే ఈ అవకాశం దక్కుతుందని చెప్పారు. క్యాంపులో ప్రతిభ కనబర్చి వరంగల్ గ్రూప్‌నకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేప్టెన్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సదానందం, కేడెట్స్ ఆర్.శశాంక్, అక్షయ్‌కుమార్, సీహెచ్ రాజు, విష్ణు, జి.రాము, జె.దేవేందర్, ఎం. రాజ్‌కుమార్, ఎస్.సాయికుమార్, రాహుల్, బాల జోహార్ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన బీజేపీతోనే సాధ్యం

జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



పార్టీలో చేరిన వారితో రావు పద్మ తదితరులు

హన్మకొండ: సుపరిపాలన బీజేపీతోనే సాధ్యమని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. ఆదివారం హనుమకొండ హంటర్ రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకుడు, కాజీపేట దర్గా పీఏసీఎస్ డైరెక్టర్ రాజ్‌కుమార్‌యాదవ్, వైఎస్‌ఆర్‌టీపీ కాజీపేట మండల అధ్యక్షుడు సిరికొండ రామేశ్వరచారి బీజేపీలో చేరారు. వారికి ఆమె కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పద్మ మాట్లాడుతూ.. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, రానున్న రోజుల్లో రాష్ట్రంలో పార్టీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 62వ డివిజన్ అధ్యక్షుడు భగవాన్ ఉపాధ్యాయ, నాయకులు చిర్ర నర్సింగ్‌గౌడ్, ఎండీ చాంద్‌పాషా, పెసరు తిలక్, కోవెల జీవన్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ కోసం నేడు బీజేపీ ధర్నా

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు రావు పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లైనా అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిర్వహించే ఈధర్నాకు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

సమన్వయంతో పని చేయాలి

- ఇంజనీర్లతో చీఫ్ విప్ సమీక్ష



మాట్లాడుతున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

హన్మకొండ: వర్షాకాలం దృష్ట్యా ముందస్తు చర్యలు చేపట్టాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని సర్క్యూట్ హౌజ్‌లో వరంగల్ నగర పాలక సంస్థ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. వర్షాలతో సమస్యలు ఉత్పన్నం అయ్యే ప్రాంతాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. సీఎంఏ, సాధారణ నిధులు, పట్టణ ప్రగతి, కింద జరుగుతున్న అభివృద్ధి పనులపై డివిజన్ల వారీగా మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. అభివృద్ధి పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. నగరాభివృద్ధిలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరంలో ఉన్న పార్కులను సుందరీకరరించాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. వడ్డేపల్లి బండ్ సుందరీకరణకు అదనపు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ రాజయ్య, డీఈలు సంతోశ్, రవికుమార్, ఏఈలు శ్రీకాంత్, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పశ్చిమ టికెట్ నాకే వస్తుంది..

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి



బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ/కాజీపేట: రానున్న ఎన్నికల్లో పశ్చిమ టికెట్ తనకే వస్తుందని కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలు సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ సర్క్యూట్ గెస్ట్‌హౌస్‌రోడ్డు విశాల్ భవన్‌లో పార్టీ 51వ డివిజన్ పోలింగ్ బూత్ కమిటీలు, ముఖ్య నాయకుల సమావేశంలో.. అలాగే కాజీపేట మండలం సోమిడి రోడ్డులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎన్నికల ప్రచార కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, స్థానికంగా ఉన్న అపరిష్కృత సమస్యలను ఎత్తిచూపుతూ ప్రభుత్వ, అధికార పార్టీ ప్రజాప్రతినిధుల వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ వస్తే బతుకులు మారతాయని, బాధలు పోతాయని నమ్మిన ప్రజలకు సీఎం కేసీఆర్ చేసింది ఏమీ లేదన్నారు. నిరుద్యోగుల చావులు, రైతుల ఆత్మహత్యలు, సామాన్య ప్రజల నెత్తిపై అప్పులే మిగిలాయని ధ్వజమెత్తారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్‌ను గద్దె దించే సమయం ఆసన్నమయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి నానాటికీ పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేని బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నట్లు గుర్తించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు తొటిరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయిని లక్ష్మారెడ్డి, అశోక్‌రావు, మీర్జా అజీజుల్లా బేగ్, బంక సరళ, మహమ్మద్ అంకుష్, మోబిన్, అనిల్‌కుమార్, కొండా నాగరాజు, ఎండీ.అంకూస్, ఎంపీ.రాజు, మేకల ఉపేందర్, పి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రేటర్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరపాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ) గ్రీవెన్స్ సోమవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాత పూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామని, సమస్యల పరిష్కారానికి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నీటి సరఫరాకు పటిష్ట చర్యలు

- మేయర్ గుండు సుధారాణి



నాలాను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి, కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్

కాశిబుగ్గ/వరంగల్ అర్బన్: మంచినీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఆదివారం వరంగల్ అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు డివిజన్లలో మేయర్, ఇంజినీర్లు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి ఇబ్బందులను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. డివిజన్‌లో నీళ్లు తక్కువ ప్రెషర్‌తో వస్తున్నాయని కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ మేయర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆదివారం ఆమె అధికారులతో కలిసి 35వ డివిజన్‌లో పర్యటించారు. ఎక్కడ నీళ్లు తక్కువ ప్రెషర్‌తో వస్తున్నాయో.. అక్కడ వాల్వ్ ఏర్పాటు చేసి నీటి సరఫరా సక్రమంగా కొనసాగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సాయి గణేశ్‌కాలనీలో రోడ్డు వేయించాలని స్థానికులు కోరగా.. రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అక్కడే ఉన్న నాలాను పరిశీలించిన మేయర్ నాలాను పూర్తిస్థాయిలో డిసిల్టింగ్ చేయించాలని ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులకు సూచించారు. ఆమె వెంట సీఎంహెచ్ఓ రాజేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి, స్థానికులు పోలేపాక నరేందర్, సౌతాకారి నరేశ్, మధు, ప్రశాంతి, ఝాన్సీ, శరత్, ఉమారాణి తదితరులు ఉన్నారు.

పొద్దు ‘తిరుగుడు’ పువ్వులు

బీజేపీ అభ్యర్థులెవరో..?

- ‘తూర్పు’, ‘పశ్చిమ’లో పోటాపోటీ
- మరో ఆరు స్థానాల్లో ఇదే పరిస్థితి
- మారిన రాజకీయ సమీకరణలు
- ఆశావహుల్లో నెలకొన్న ఉత్కంఠ
- కొత్తదారుల్లో బండి సంజయ్ కోటరీ..
- కిషన్‌రెడ్డికి ఆశావహుల దరఖాస్తులు
- ‘ఈటల’ను కలుస్తున్న పలువురు
- అగ్రనేతల చుట్టూ చక్కర్లు



సాక్షిప్రతినిధి, వరంగల్: అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. ఈమేరకు ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేయగా.. ప్రధాన రాజకీయ పక్షాలు కూడా దూకుడు పెంచాయి. త్వరలోనే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ 40 స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ సైతం అభ్యర్థుల వేటలో పడింది. ఇదే సమయంలో మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో టికెట్లపై భారతీయ జనతా పార్టీ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. దీంతో ఆశావహులు టికెట్ల రేసులో పడరాని పాట్లు పడుతున్నారు. ఉమ్మడి వరంగల్‌లో 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎనిమిది స్థానాల్లో పోటాపోటీగా ఆశావహులు లాబీయింగ్ చేస్తున్నారు. ఇంత కాలం బండి సంజయ్ కోటరీలో ఉన్నవారంతా ఇప్పుడు కొత్తదారులు వెతుక్కుంటున్నారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర చీఫ్ కిషన్‌రెడ్డికి దరఖాస్తు చేసుకుంటున్నారు. తెలంగాణ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌ను కలవడంతో పాటు ఎవరికీ వారుగా అగ్రనేతల చుట్టూ చక్కర్లు కొడుతుండడం ఆ పార్టీ క్యాడర్‌లో హాట్‌టాపిక్‌గా మారింది.

ముదురుతున్న టికెట్ల పోరు

ఎన్నికల సమయం సమీపిస్తున్నా కొద్దీ బీజేపీలో టికెట్ల పోరు ముదురుతోంది. వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో ఆశావహులు గట్టిగా ఎవరికివారు ప్రయత్నాలు చేస్తుండగా.. మరో ఆరు చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. వరంగల్ తూర్పులో బీసీ సామాజిక వర్గానికి ఓటర్లు పెద్ద పీట వేస్తుండగా.. ఇక్కడి నుంచి నలుగురు బీజేపీ టికెట్ కోసం పోటీ పడుతున్నారు. కుసుమ సతీష్, గంట రవికుమార్, వన్నాల వెంకటరమణ మొదటి నుంచి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తుండగా.. బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. వరంగల్ పశ్చిమ నుంచి జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. పోటీకి సుముఖంగా ఉన్న మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు సైతం టికెట్ రేసులో ఉన్నారు. జనగామ నియోజకవర్గం నుంచి నలుగురి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ముక్కెర తిరుపతిరెడ్డి, బేజాడి బీరప్ప, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, గాడిపల్లి ప్రేమలతారెడ్డి పోటీ పడుతున్నారు. ములుగు నియోజకవర్గం నుంచి అజ్మీరా కృష్ణవేణి నాయక్, భూక్యా రాజునాయక్, తాటి కృష్ణ, భూక్యా జవహర్‌లాల్ ప్రయత్నంలో ఉన్నారు. బీజేపీకి కూడా మంచి పట్టున్న పరకాల నియోజకవర్గంపై ఇప్పుడు ప్రముఖులు కన్నేశారు.

ప్రముఖ వైద్యుడు డాక్టర్ కాళీప్రసాదరావు పేరు ప్రముఖంగా వినిపిస్తుండగా.. మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అదే రేసులో ఉన్నారు. ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సతీమణి పేరు కూడా వినిపిస్తుండగా, డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి టికెట్ అడుగుతున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి డాక్టర్ జి.విజయరామారావుతో పాటు మాదాసు వెంకటేష్, బొజ్జపల్లి సుభాష్ తదితరులు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. మహబూబాబాద్ నుంచి గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ పేరు వినిపిస్తుండగా, జిల్లా అధ్యక్షుడు యాప సీతయ్య, వైస్ ఎంపీపీ మల్లయ్య సతీమణి యల్ది నాగలక్ష్మి అడుగుతున్నారు. భూపాలపల్లి నుంచి చందుపట్ల కీర్తిరెడ్డి పేరు దాదాపు ఖరారైనట్లే చెప్తుండగా.. మాజీ పోలీసు అధికారి ఒకరు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. నర్సంపేట, వర్ధన్నపేట నుంచి మాజీ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, కొండేటి శ్రీధర్ ఉన్నారు. డోర్నకల్ నుంచి గుగులోత్ లక్ష్మణ్‌నాయక్‌తో పాటు పాలకుర్తి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థుల కోసం ఆ పార్టీ అధిష్టానం వెతుకుతోంది.

ఉమ్మడి జిల్లాపై సమీకరణల ప్రభావం

బీజేపీలో జరిగిన సంస్థాగత మార్పులు, సమీకరణలు ఉమ్మడి వరంగల్ నేతలు, క్యాడర్‌పై ప్రభావం చూపనున్నాయి. రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పాదయాత్ర, సభలు, సమావేశాల ద్వారా ఉమ్మడి వరంగల్‌పై పట్టు సాధించారు. 12 నియోజకవర్గాల్లో తనకంటూ ఫాలోవర్లు, టికెట్ ఆశావహులు ఏర్పడ్డారు. టికెట్ ఆశించే సీనియర్లు కూడా సంజయ్‌కుమార్‌తో క్లోజ్‌గా తిరిగి ఆయన కోటరీగా ముద్ర వేసుకున్నారు. ఇదే సమయంలో పార్టీ అధ్యక్ష పదవి నుంచి బండిని తప్పించిన అధిష్టానం.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పార్టీ పగ్గాలు అప్పగించింది. రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు బాధ్యతలు ఇవ్వడంతో ఉమ్మడి జిల్లాలో ఒక వర్గంగా ముద్ర పడిన ఆశావహ నేతలంతా కొత్తదారులు వెతుక్కుంటున్నారు. ఈనేపథ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీ టికెట్ ఎవరిని వరిస్తుందో అనే చర్చ పార్టీలో జరుగుతోంది.

అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేద్దాం

- ‘కుడా’ మాజీ చైర్మన్ యాదవరెడ్డి
- ప్రవాసీ రెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న మర్రి యాదవరెడ్డి

హన్మకొండ అర్బన్: ప్రవాసీ రెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ అభివృద్ధికి రెడ్డి కులంలో ఆర్థికంగా స్థిరపడ్డవాళ్లు కృషి చేయాలని ప్రవాసీ రెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు, ‘కుడా’ మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి అన్నారు. ఆదివారం హంటర్‌రోడ్డులోని విష్ణుప్రియ గార్డెన్స్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు నూకల అంజివర్ధన్‌రెడ్డి అధ్యక్షతన అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మర్రి యాదవరెడ్డి మాట్లాడుతూ.. విదేశాల్లో చదువుతున్న, విద్య, ఉద్యోగ రంగాల్లో రాణిస్తున్న రెడ్డి విద్యార్థుల యోగ క్షేమాలు తెలుసుకొని ఇక్కడ వారి తల్లి దండ్రులు ఆనందంగా ఉండేలా.. గతేడాది అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్ జిల్లా కేంద్రంగా ఉన్న ఈ అసోసియేషన్‌ను రాష్ట్ర స్థాయిలో అన్ని జిల్లాల్లో విస్తరింపజేయాలన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోయగూర వెంకటరంగారెడ్డి వార్షిక నివేదికను, కోశాధికారి పింగిలి వీరారెడ్డి ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టగా.. సభ్యులు చప్పట్లతో ఆమోదించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సలహాదారులు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నూకల ఉషాదేవి, జాయింట్ సెక్రెటరీ గోపు శంకర్‌రెడ్డి, బొడిగం పద్మ కనకారెడ్డి, మీడియా కార్యదర్శి కామిడి సతీశ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు, రెడ్డి కులస్తులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు..

- యువకుడికి తీవ్రగాయాలు
- చింతల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఘటన

ఖిలా వరంగల్ : బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన చింతల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద జరిగింది. బాధితుడి కథనం ప్రకారం వరంగల్ 36వ డివిజన్ చింతల్ ప్రాంతానికి చెందిన గుమ్మటి సాయి(23) ఆదివారం రాత్రి 10 గంటలకు పుప్పాలగుట్టలోని ఓ కిరాణ షాపులో బియ్యం కొనుగోలు చేసి బైక్ పై తిరిగి చింతల్‌కు బయల్దేరాడు. ఈక్రమంలో ఖిలా వరంగల్ జంక్షన్ నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొంది. దీంతో సాయి బైక్ పై నుంచి పడి తీవ్రగాయాలపాలయ్యాడు. డ్రైవర్ కారును ఆపకుండా పారిపోతుండగా స్థానికులు వెంబడించి రాంకీ ఓసిటీ గ్రౌండ్ వద్ద పట్టుకున్నారు. అయితే డ్రైవర్ కారును వదిలి పరారయ్యాడు. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని 108లో ఎంజీఎం తరలించారు. ఈవిషయం తెలిసిన మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.


రైలు ఢీకొని వృద్ధుడి మృతి

డోర్నకల్: మహబూబాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. డోర్నకల్ జీఆర్‌పీ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబా బాద్ స్టేషన్ సమీపంలోని ఎల్‌సీ గేట్ 80 శివారులో శని వారం రాత్రి దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సమాచారం మేరకు ఘటనా స్థలంలో మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. మృతు డు ఖమ్మం జిల్లా వైరా మండలం గన్నవరానికి చెందిన వనపరవు కృష్ణ(55)గా గుర్తించామని, మృతుడి మానసిక స్థితి సక్రమంగా లేనట్లు గుర్తించామని తెలిపారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ సహకారంతో ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ప్రకృతి వైద్య లైబ్రరీ.. ఇక రీసెర్చ్‌సెంటర్

నేడు అంతర్జాతీయ ప్రకృతి వైద్య లైబ్రరీ 5వ వార్షికోత్సవం

- ప్రకృతి వైద్య పరిశోధకుడు గజ్జల రామేశ్వరం..
- సొంత ఇంటి భవనంలోనే లైబ్రరీ.. ఉచిత ప్రవేశం


హనుమకొండలోని ఆచార్య గజ్జల రామేశ్వర అంతర్జాతీయ నేచురోపతి లైబ్రరీ..

కేయూ క్యాంపస్: ఆయుర్వేద వైద్య విధానంలో ప్రకృతి వైద్య విధానం(నేచురోపతి) ఒక భాగం. 18వ శతాబ్దంలో పలు దేశాల్లో ప్రకృతి వైద్యం ఉన్నత స్థానంలో ఉండేది. సుమారు 25 భాషలలో ఈ వైద్యవిధానంపై పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రకృతి వైద్య సాహిత్య విజ్ఞానాన్ని ప్రజాబాహుళ్యంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రిటైర్డ్ ఆచార్యుడు గజ్జల రామేశ్వరం హనుమకొండ బ్యాంకు కాలనీలోని తన సొంత భవనంలో అంతర్జాతీయ ప్రకృతివైద్య గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. 2018 జూలై 24న జాతీయ గ్రంథాలయంగా ఏర్పాటుచేసి 2020 జూలై 24న అంతర్జాతీయ నేచురోపతి లైబ్రరీగామార్చారు. ఈ క్రమంలో ఈనెల 24న లైబ్రరీ 5వ వార్షికోత్సవం నిర్వహించబోతున్నారు.అదే రోజు ఈ లైబ్రరీని నేచురోపతి రీసెర్చ్‌సెంటర్‌గా కూడా మార్పుచేసి ప్రారంభించబోతున్నారు. అలాగే తానే రచించిన 'ఇండెక్స్ టూది ఇండియన్ ఇండియన్ నేచురోపతి' పుస్తకాన్ని కూడా ఆవిష్కరించబోతున్నారు.

వృత్తి రీత్యా ఆచార్యుడు

గజ్జల రామేశ్వరం.. కాకతీయ యూనివర్సిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఆచార్యుడిగా పనిచేస్తూనే ఇతర సమయాల్లో ప్రకృతివైద్య సాహిత్యం సేకరణ చేస్తూ వచ్చారు. 2016 సెప్టెంబర్ 30న ఆచార్యుడిగా ఉద్యోగ విరమణ పొందాక తన సొంత భవనంలోనే ఈ నేచురోపతి లైబ్రరీని ఏర్పాటు చేశారు.

లైబ్రరీలో 'ప్రకృతి' పుస్తకాలు

ప్రకృతివైద్య సాహిత్యవిజ్ఞాన సంపద.. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ, కన్నడ, మలయాళీ, మరాఠీ బెంగాలి, మణిపురి , ఫ్రెంచ్ భాషల్లో ఉంది. వివిధ రకాల ప్రకృతివైద్యానికి సంబంధించిన పత్రికలు 30వరకు అందుబాటులోఉన్నాయి.

లైబ్రరీలోకి ఉచిత ప్రవేశం

ప్రకృతి వైద్యంపై అవగాహన పెంచుకోవాలనుకునే వారికి ఈలైబ్రరీలో ఉచిత ప్రవేశం ఉంది. ప్రస్తుతం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు ఎవరైనా లైబ్రరీలో చదువుకోవచ్చు.

పుస్తకప్రదర్శనలు

రామేశ్వరం.. ప్రకృతివైద్య విజ్ఞాన పుస్తకాలు, జర్నల్స్‌ను ఎక్కడ ఈ వైద్యవిధానంపై సెమినార్లు జరిగినా ప్రదర్శిస్తారు. తొలుత 1992 నవంబర్‌లో హనుమకొండలో , 1995లో వరంగల్‌లో, 2022లో డిసెంబర్ 23,24తేదీల్లో విజయవాడలో ప్రదర్శించారు.

ప్రకృతివైద్యం.. డ్రగ్‌లెస్‌థెరఫీ

ప్రకృతి వైద్యం.. ఔషధ రహిత చికిత్స. మట్టివట్టీలు, తొట్టిస్నానాలు, జలచికిత్స, సూర్యకిరణ్ చికిత్స ఇలాంటి పదాలు ప్రకృతివైద్యంలో ఆచరిస్తారు. ప్రకృతివైద్యం అంటే నీరు, ఆహారం, యోగా, వ్యాయామం.

ప్రకృతి వైద్యగ్రంథాల కృషి తెలుగులోనే..

దేశంలో ప్రకృతివైద్య గ్రంథాల కృషి మొదట తెలుగులోనే ప్రారంభమైందని రామేశ్వరం తెలిపారు. ద్రోణంరాజు వెంకటాచలపతి శర్మ ఇంగ్లిష్ నుంచి తెలుగులోకి అనువదించిన ప్రకృతివైద్య గ్రంథం 1887లో ముద్రణ అయింది.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డు

హైదరాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ మెడికల్‌హెరిటేజ్‌లో 2016 మే 3న ప్రకృతివైద్య అరుదైన పుస్తకాల ప్రదర్శన చేసిన రామేశ్వరానికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో చోటు లభించింది. కాగా, ప్రకృతివైద్య సేవలకుగాను న్యూఢిల్లీలో 1999లో రామేశ్వరాన్ని గాంధీ స్మారక ప్రకృతి చికిత్స సమితి వారు సన్మానించి బ్రాంజిమెడల్ అందించారు.

ప్రకృతి వైద్యవిధానాన్ని విశ్వవ్యాప్తం చేయాలి



ప్రకృతివైద్య విధానాన్ని విశ్వవ్యాప్తం చేయాలనే లక్ష్యంతోనే ఈ అంతర్జాతీయ నేచురోపతి గ్రంథాలయం ఏర్పాటు చేశా. సామాన్య ప్రజానీకం మొదలు.. పరిశోధకులకు అందుబాటులో ఉంచేందుకు ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశా. భారతదేశంలోనే గొప్ప ప్రకృతివైద్య గ్రంథాలయంగా తీర్చిదిద్దేదందుకు రీసెర్చ్ సెంటర్‌గా మార్చు చేశా.

–ఆచార్య గజ్జల రామేశ్వరం,
ప్రకృతి వైద్య లైబ్రరీ వ్యవస్థాపకుడు

విద్యాప్రమాణాలు పెంపొందించాలి

- మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలం
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి


నారాయణగిరి జెడ్పీహెచ్‌ఎస్ పీజీహెచ్‌ఎం రాంధన్‌ను సన్మానిస్తున్న టీచర్ ఎమ్మెల్సీ

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంపొందించాల్సిన అవసరం ఉందని ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) హనుమకొండ, వరంగల్ జిల్లాల శాఖల ఆధ్వర్యంలో వ్యాస పౌర్ణమి సందర్భంగా ఆదివారం హనుమకొండలోని సామజగన్మోహన్ రెడ్డి స్మారక భవనంలో గురువందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 26వేల 500 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. ఇందులో ఎక్కువశాతం పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేవన్నారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వాష్‌రూమ్‌లు లేక విద్యార్థినుల తోపాటు మహిళా ఉపాధ్యాయులు పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలనే విషయం విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానన్నారు. అనంతరం జాతీయవాద రచయిత భాస్కర యోగి మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థిగానే వివిధ పుస్తకాలను అధ్యయనం చేయాలన్నారు.అప్పుడే విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయగలుగుతారన్నారు. టీపీయూఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయ పెండింగ్ సమస్యలపై జరిగే దశల వారీ పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సభలో టీపీయూఎస్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ఆముదాల దాత మహర్షి ,బత్తిని వెంకటరమణ, బత్తిని వీరస్వామి, ఉప్పుల సతీష్ , ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దాస్యం రామానుజస్వామి, పిన్నింటి బాలాజీరావు, మాచర్ల భిక్షపతి , డీఈవో కార్యాలయం కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ బి రాధ, ఎంఈవోలు రత్నమాల, సత్యనారాయణ, ఈసరి రవీందర్, నారాయణగిరి జిల్లాపరిషత్ హైస్కూల్ పీజీహెచ్ఎం బి రాంధన్, టీపీయూఎస్ బాధ్యులు అశోక్, మనోజ్‌కుమార్, సామల కవిత, శ్రీలత, సంగెం శ్రీనివాస్ ,మల్లారెడ్డి,బాబురావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పుల సహస్రతేజ కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది.

బీఎంఎస్.. కార్మికులకు అండ


ఆవిర్భావ వేడుకల్లో రమణారెడ్డి, శశికుమార్

హన్మకొండ: బీఎంఎస్.. కార్మికులకు అండగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు ఆర్.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.శశికుమార్ అన్నారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం ఎదుట బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. విద్యుత్ సీనియర్ మహిళా ఉద్యోగి సరోజనమ్మ బీఎస్ఎం పతకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు యూనియన్ కృషి చేస్తుందన్నారు. ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం, శ్రేయస్సే బీఎంఎస్ లక్ష్యమన్నారు. విద్యుత్ ఉద్యోగులు యూనియన్‌కు అండగా నిలువాలన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా ఇన్‌చార్జ్ మహేందర్, తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు రాజయ్య, శ్రీను, సత్యనారాయణ రెడ్డి, రాజేష్ కుమార్, వేణు మాధవ్, సంగీత్ కుమార్, లక్ష్మణ్ నాయక్, సతీష్ బాబు సంపత్, మహేష్, వేణు అనిల్ రెడ్డి, గంజి శ్రీనివాస్, విజేందర్, అజయ్ పాల్గొన్నారు.

ఓరుగల్లుకు రావడం సంతోషంగా ఉంది

- భారత్, నేపాల్ రాయబారి, పోప్‌దూత లియోపోల్డ్ గిరెల్లి


పోప్ దూతను సన్మానిస్తున్న కేథడ్రల్ చర్చి కమిటీ బాధ్యులు

కాజీపేట రూరల్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఓరుగల్లు మహానగరానికి రావడం సంతోషంగా ఉంది.. ఇక్కడి ప్రజలందరిపై దేవుడి దీవెనలు, ఆశీర్వాదాలు నిండుగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు భారత్, నేపాల్ రాయబారి, పోప్‌దూత లియోపోల్డ్ గిరెల్లి అన్నారు. హనుమకొండ జిల్లా కాజీపేటలోని ఫాతిమా కెథిడ్రల్ చర్చిలో ఆదివారం దివ్యబలిపూజ సమర్పించారు. అనంతరం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన వృద్ధులకు శుభాకాంక్షలు తెలిపి పలువురిని సన్మానించారు. ఈ సందర్భంగా లియోపోల్డ్ మాట్లాడుతూ వృద్ధాప్యం శాపం కాదని, కుటుంబ సభ్యులు పెద్దలను ఆదరించి వారి దీవెనలు పొందాలన్నారు. అనంతరం ముంబై కార్డినల్ ఓస్వాల్డ్ గ్రేషియస్ ప్రసంగించారు. అనంతరం కేథడ్రల్ చర్చి ప్రెసిడెంట్ బొక్క దయాసాగర్ నేతృత్వంలో విచారణ కౌన్సిల్ సభ్యులు పోప్ దూత గిరెల్లిని, కార్డినల్ ఓస్వాల్డ్ గ్రేషియస్, బెల్లారి బిషప్ హెన్రి డిసొజాలను సన్మానించగా.. కార్యవర్గ సభ్యులు శౌరీలు, జి.సుమ, కె.రాణి తిలకం దిద్దారు. కార్యక్రమంలో ఓరుగల్లు పీఠాధిపతి బిషప్ ఉడుమల బాల, విచారణ గురువు ఫాదర్ కాసుమర్రెడ్డి, ఫాదర్లు డి.విజయపాల్, ఆర్.ప్రవీణ్, థామస్, కిరణ్, ప్రధాన కార్యదర్శిటామి, ట్రెజరర్ ప్రకాష్‌రెడ్డి, టిక్కు, కిరణ్, బాస్కర్, పి.శ్రీనివాస్, ప్రవీణ్, సుధీర్ పాల్గొన్నారు.

ఆశీర్వాదం తీసుకున్న ప్రభుత్వ చీఫ్‌విప్

ఫాతిమా బిషప్‌హౌస్‌లో పోప్‌దూత లియోపోల్డ్ గిరెల్లి తదితరులను ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. టీఆర్వీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.జాన్సన్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి..

- 9 మంది అరెస్ట్, ఒకరు పరార్
- రూ.54,210 నగదు, 4 స్మార్ట్‌ఫోన్లు, 2 బైక్‌లు స్వాధీనం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి తూర్పుకోటలోని కోట గండి సమీపంలో పేకాట స్థావరంపై ఆదివారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో ఒకరు పరార్ కాగా 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వీరి వద్ద నుంచి రూ.54,210 నగదు, 4 స్మార్ట్ ఫోన్లు , 2బైకులు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి కథనం ప్రకారం కోట గండి సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాస్‌రావు, ఏ.రాంబాబు, దేవేందర్ ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో హరిబాబు పరార్ కాగా తూర్పుకోటకు చెందిన తోట శ్రీనివాస్, మొద్దు పాపయ్య, తాటికొండ శ్రీధర్, చింతల్‌కు చెందిన ముత్తినేని సంతోష్‌కుమార్, తూర్పుకోటకు చెందిన వడ్డె వంశీకృష్ణ, పిట్టల సతీష్, సిరబోయిన రమేష్, బండ రాజు, ముత్తి రాజేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద నుంచి రూ. 54,210 నగదు, 4 స్మార్ట్‌ఫోన్లు ,2బైకులు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌కు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు కె. శ్రీనివాస్, ఎ.రాంబాబు, పి.దేవేందర్, ఎస్సైలు వి.లవన్‌కుమార్, బి.శరత్, డి .రాజు, నర్సింహారావు, వంశీ కృష్ణ ,సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

వరంగల్ స్పోర్ట్స్: ఉమ్మడి వరంగల్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని డీఎస్‌ఏ స్విమ్మింగ్‌పూల్ లో ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. సబ్‌జూనియర్స్, జూనియర్స్ బాలబాలికల విభాగంలో నిర్వహించిన పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 30మంది క్రీడాకారులు హాజరైనట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మంచాల స్వామిచరణ్ తెలిపారు. క్రీడాకారులకు బటర్ ఫ్లై, బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్, ఫ్రీస్టైల్, ఇండివిజువల్ మిడ్‌లే విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 29, 30వ తేదీల్లో హైదరాబాద్ బేగంపేటలోని హెచ్‌పీఎస్ స్విమ్మింగ్‌పూల్ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌సింగ్ ఠాకూర్, డీఎస్‌ఏ స్విమ్మింగ్ కోచ్ రాయబారపు నవీన్, భూపాలపల్లి సింగరేణి కోచ్ అఖిల్ పాల్గొన్నారు.

సిమెంట్ షాపులో చోరీ..

- రూ.1000 నగదు అపహరణ
- ఘటనా స్థలిని పరిశీలించిన పోలీసులు


క్యాష్ కౌంటర్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సిద్దంరాజు, ఎస్సై శ్రీలత

ఖిలా వరంగల్: వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన మహేశ్వరి ఐరన్, సిమెంట్ షాపులో చోరీ జరిగింది. ఈ ఘటన ఆదివారం తెల్లవారు జామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ విద్యానగర్ కాలనీకి చెందిన 39వ డివిజన్ కార్పొరేటర్ సిద్దం రాజు ఖమ్మం జాతీయ రహదారిపై రెండు షెట్టర్లను అద్దెకు తీసుకుని ఓ షెట్టర్‌లో మహేశ్వరి ఐరన్, సిమెంట్ షాపు గోదాము ఏర్పాటు చేయగా.. మరో షెట్టర్‌లో ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేశాడు. రోజు మాదిరిగానే శనివారం రాత్రి 9గంటలకు గుమస్తాలు షాపులకు తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం 8 గంటలకు షాపు తెరిచేందుకు రాగా కార్యాలయానికి సంబంధించిన షెట్టర్ తాళాలు ధ్వంసం చేసి ఉన్నాయి. ఈ విషయం గమనించిన గుమస్తాలు వెంటనే మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌తోపాటు యజమానికి సమాచారం తెలిపారు. దీంతో ఎస్సై శ్రీలత, క్లూస్ టీమ్ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్యాష్ కౌంటర్‌లో నిల్వ ఉన్న రూ.1000 నగదును అపహరించినట్లు గుర్తించారు. పెద్దగాచోరీ కాకపోవడం, నగదు నిల్వలేకపోవడంతో షాపు నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత క్లూస్ టీమ్ అధికారులు పెట్టర్ తాళం, క్యాష్ కౌంటర్ తాళాలను పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. అనంతరం బాధితుడు సిద్దం రాజు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు.

అటవీ భక్షకులు..

- నిబంధనలకు విరుద్ధంగా కలప తరలింపు
- అటవీ శాఖ అధికారుల నిర్వాకం


నిబంధనలకు విరుద్ధంగా కలపను తరలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

కన్నాయిగూడెం: అటవీ సంపదను కాపాడాల్సిన అధికారులే స్మగ్లర్లుగా మారారు. ఆదివారం ఉన్నతాధికారులు సెలవులో ఉంటారని తెలిసి సొంత అవసరాలకు కలపను తరలించారు. కన్నాయిగూడెం మండలంలోని ఓ గ్రామం నుంచి నిబంధనలకు విరుద్ధంగా గృహోపకరణాల నిమిత్తం తరలించారు. దీనిపై ప్రజలు మండిపడుతున్నారు. ఇంటి నిర్మాణాలు, ఇతర అవసరాలకు అటవీశాఖ నుంచి నిబంధనల మేరకు తాము అనుమతులు తీసుకుంటుంటే.. అధికారులు మాత్రం నిబంధనలకు నీళ్లొదులుతూ అడవిని లూటీ చేస్తున్నారని వారు వాపోయారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చావుకబురు చల్లగా..

- చేతులెత్తేసిన వైద్యులు
- చికిత్సకు రూ.8లక్షలు
- 30 గుంటల భూమి అమ్మకం
- అయినా ప్రయోజనం శూన్యం
- చికిత్స పొందుతున్న యువకుడి మృతి


సురేష్ (ఫైల్)

బచ్చన్నపేట : రెక్కాడితేకాని డొక్కాడని కుటుంబం అది. రోజువారీగా కూలీకి వెళ్తేనే వారికి పూట గడిచే ఆ దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. ఇందులో రెండో కుమారుడు కుటుంబ కలహాలతో ఇటీవల పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సకు రూ. 8 లక్షల వరకు ఖర్చు అయింది. దీంతో దిక్కుతోచని పరిస్థితి.. పైగా చేతిలో చిల్లిగవ్వ లేని దుస్థితి..ఈ క్రమంలో తండ్రి ఎవరిని అప్పు అడిగిన లభించలేదు. దీంతో తన కుమారుడి ఆరోగ్యం కంటే ఏదీఎక్కువ కాదని భావించి గ్రామంలో తమకున్న తాతల నాటి ఆస్తి 30 గుంటల భూమిని అమ్మకానికి పెట్టాడు. వచ్చిన డబ్బుతో సరాసరి ఆస్పత్రికి వెళ్లి చెల్లించాడు. అయితే డబ్బు తీసుకున్న అనంతరం ఆస్పత్రి యాజమాన్యం చావు కబురు చల్లగా చెప్పారు. క్షతగాత్రుడికి వైద్యం చేయలేమని చేతులెత్తేశారు. మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలని ఉచిత సలహా ఇచ్చారు. దీంతో చేసేది లేమీ లేక మరో ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భూమిజాగా అమ్మినా బతుకలే కపోతివి కదా కొడుకా అంటూ తల్లిండ్రులు మృతదేహంపై రోదించిన తీరు ప్రతీ ఒక్కరిని కదలించింది. బచ్చన్నపేట మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన చెవుల నర్సయ్య, జయమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. రెండో కుమారుడు చెవుల సురేష్(27) హైదరాబాద్‌లో పెయింటింగ్ పని చేస్తున్నాడు. రెండు నెలల క్రితం హైదరాబాద్ మల్కాజిగిరి కొపూర్ గ్రామానికి చెందిన ప్రియాంకను వివాహం చేసుకుని అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో గత నెల 28న కుటుంబ కలహాల నేపథ్యంలో గడ్డి మందు తాగగా వాంతులు విరేచనాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సురేష్‌ను హైదరాబాద్ ఈసీఎల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ రూ.8 లక్షల వరకు ఖర్చు అయింది. దీంతో తండ్రి నర్సయ్య గ్రామంలో తమకున్న 30 గుంటల భూమిని విక్రయించి ఆస్పత్రి బిల్లు చెల్లించాడు. అయితే బిల్లు చెల్లించిన అనంతరం అక్కడి వైద్యులు చేతులు ఎత్తివేశారు. దీంతో వెంటనే సురేష్‌ను పంజాగుట్టలోని నిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స ఆదివారం పొందుతూ మృతి చెందాడు. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంబోతు, ఆవుకు పెళ్లి


ఆంబోతుకు పూజలు చేసి వదులుతున్న ప్రజలు

గార్ల: మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పెద్దకిష్టాపురం ప్రజలు ఆదివారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆంబోతు, ఆవుకు పెళ్లి చేశారు. అనంతరం ఆంబోతును గ్రామంలో వదిలారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఇది ఆచారంగా వస్తోందని, ఆంబోతు ఎవరి ఇంటికి వెళ్లినా గడ్డి తదితరాలు వేసి దేవుడిగా భావిస్తారని స్థానికులు తెలిపారు.

బొగతకు పోటెత్తిన పర్యాటకులు


బొగత వద్ద కొలనులో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధి చీకుపల్లి సమీపాన ఉన్న బొగత జలపాతానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. ఒక్కసారిగా పర్యాటకుల తాకిడి పెరగడంతో సిబ్బంది కూడా ఇబ్బందులు పడ్డారు. జలపాతంలోకి ఎవరినీ అనుమతించ లేదు. నీటి కొలనులో లోతు లేని ప్రదేశంలో స్నానాలను చేయడానికి అనుమతి నిచ్చారు.